# చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మెంబర్ గౌస్‌పాషా

పరిగి, నవంబర్ 9: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని పరిగి లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మెంబర్‌గౌస్‌పాషా పేర్కొన్నారు. శనివారం జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా పరిగి మున్సిపల్ పరిధిలోని తుంకులగడ్డలో ఉన్న ప్రభుత్వ ఎస్టీ జూనియర్ కళాశాల వసతి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదలు, ఇతర వర్గాల వారు ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చున్నారు. అందరూ సమానంగా న్యాయం పొందే హక్కు ఉందని చెప్పారు. వాహనదారులకు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని సూచించారు. ప్రమాదం జరగకుండా రక్షణకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఇతర పలు అంశాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది అనిల్, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

# 430 ఎకరాల ఆయకట్టు సాగుకు అనుమతి



రైతులతో సమావేశమైన ఎంపీడీవో, ఇరిగేషన్ అధికారులు

దోమ, నవంబర్ 9: మండల పరిధిలోని అయినాపూర్ పెద్ద చెరువులో ఉన్న నీటి సామర్థ్యం మేరకు 430 ఎకరాల ఆయకట్టు సాగుకు అనుమతి ఇచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు తెలిపారు. శనివారం గ్రామానికి చెందిన రైతులతో చెరువు దగ్గర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో అభిప్రాయాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నీటి సామర్థ్య మేరకు పంటల సాగుకు అనుమతి ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ టెక్నికల్ అసిస్టెంట్ కేశవులు, ఆర్ఐ సుదర్శన్, పెద్దలు మధుసూదన్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ విజయాంజకేయులు, సైదుపల్లి భీమయ్య, నల్ల వెంకటయ్య, కృష్ణయ్య, నర్సింహులు, గోవర్ధన్, సాయిలు, వెంకటేశ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# పానీ.. పరేషానీ

- మిషన్ భగీరథ తాగునీరు రాక ఇబ్బందులు
- దోమలోని ఇందిరమ్మ కాలనీలో ట్యాంకు ఉన్నా నీళ్లు రాని వైనం
- నెల రోజులుగా రావడం లేదని కాలనీ వాసుల ఆవేదన

దోమ, నవంబర్ 9: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇందిరమ్మ కాలనీ వాసులకు తాగు నీరు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు మార్లు తాగునీరు రావడం లేదని విన్నవించినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. దోమ మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో తొంబై వేల నీటి సామర్థ్యం ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు ఉన్నప్పటికీ తాగు నీరు ట్యాంకుకు ఎక్కించలేకపోతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీ వాసులు అంటున్నారు. తాగు నీరు రావడం లేదని మిషన్ భగీరథ వాటర్‌మన్‌ను అడుగగా వాటర్ ట్యాంకుకు నీరు ఎక్కించే పైప్ చిన్నదిగా ఉండడంతో నీరు ట్యాంకుకు ఎక్కడం లేదని సమాధానం ఇచ్చాడని కాలనీ వాసులు చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే మాకు తాగు నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా తాగు నీటి సమస్యను కాలనీవాసులు నా దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు విన్నవించగా సమస్యను పరిష్కరిస్తామని చెప్పినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించని పక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని కాలనీ వాసులు పేర్కొన్నారు.



ఇందిరమ్మ కాలనీలోని మిషన్ భగీరథ తాగు నీటి ట్యాంకు

### ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలి



నెల రోజులుగా ఇందిరమ్మ కాలనీలో తాగు నీరు రాక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో పెద్ద మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు ఉన్నా తాగు నీరు మాత్రం అందడం లేదు. ప్రత్యేక అధికారులు ఇప్పటికైనా స్పందించి తక్షణమే తాగు నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి. **- జాకటి వెంకటయ్య, కాలనీవాసి, దోమ**

# ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



దోమ: బాసుపల్లిలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో మహేశ్‌బాబు



ధారూరు : కుక్కిందలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ షాజిదా బేగం

దోమ, నవంబర్ 9: ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎంపీడీవో మహేశ్ బాబు అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా బాసుపల్లిలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏండ్లు నిండే వారందరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదుతో పాటు అభ్యంతరాలు, చిరునామా తదితర సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు అనంతరం ఓటు హక్కు ప్రాధాన్యత తదితర అంశాలపై యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట్, పంచాయతీ కార్యదర్శి రవి, జూనియర్ అసిస్టెంట్ సరిత, ఫీల్డ్ అసిస్టెంట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

**కుక్కింద గ్రామంలో..**

**ధారూరు:** 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ పేర్లను నమోదు చేసుకోవాలని తహసీల్దార్, నియోజకవర్గ ఎన్నికల నమోదు సహాయ అధికారి షాజిదాబేగం అన్నారు. శనివారం మండల పరిధిలోని కుక్కింద గ్రామంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతనంగా ఓటు హక్కు కోసం 23 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఓటరు జాబితా నుంచి పేర్ల తొలగింపునకు 21 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. బీఎల్‌వోలు వారి పోలింగ్ స్టేషన్లలో ఉదయం 9 నుంచి 4 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో యువతీయువకులకు ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఆమె పలు సలహాలు, సూచనలు ఇచ్చింది.

# సర్వేల పేరుతో మోసం చేస్తున్న కాంగ్రెస్

**బీఆర్‌ఎస్ పార్టీ వికారాబాద్ యూత్ అధ్యక్షుడు గిరీశ్ కొఠారి**



వికారాబాద్, నవంబర్ 9: కాంగ్రెస్ ప్రభుత్వం సర్వేల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నదని బీఆర్‌ఎస్ పార్టీ వికారాబాద్ యూత్ అధ్యక్షుడు గిరీశ్‌కొఠారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హామీలు అందరికీ... మాఫీ కొందరికీ అని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త ధోరణి అవలంబిస్తున్నదన్నారు. ప్రజా పాలన పేరుతో పథకాలకు దరఖాస్తు చేసుకున్న నిరుపేదలకు ప్రభుత్వం మొండి చెయ్యి చూపించిందన్నారు. ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు ఎక్కడ పాయే అని ప్రశ్నించారు. ప్రస్తుతం గ్రామాల్లో కుటుంబ సర్వే పేరుతో ప్రజలను మరో సారి మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500, వృద్ధులు, వితంతువులకు రూ.4వేల పింఛన్, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. రైతు భరోసా, రుణ మాఫీ ఇస్తామని రైతులను మోసం చేసిందన్నారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని.. 11 నెలలు గడుస్తున్నా వాటిని అమలు చేయకపోవడం దారుణమన్నారు.

# రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

**బీఆర్‌ఎస్ మండల సీనియర్ నాయకుడు మఠం రాజశేఖర్**

కులకచర్ల, నవంబర్ 9: రైతుభరోసా నిధులను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు మఠం రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట చేతికొచ్చినా ఇప్పటివరకు రైతులకు రైతు భరోసా నిధులను విడుదల చేయకపోవడం వారిని మోసం చేయడమేనని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఏడాదిలో రెండు విడుతల్లో రైతు బంధు నిధులు విడుదల చేసేదని గుర్తు చేశారు. ఆ సమయంలో పంటలు సాగు చేసే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదన్నారు. రైతు భరోసా నిధులు విడుదల చేయకపోవడంతో రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేయాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకొనే కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేస్తున్నదన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి కొందరికీ చేసి మిగతా వారికి మొండి చెయ్యి చూయించడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి వాటిని అమలు చేయడం లేదన్నారు. కుల గణన పేరుతో ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించకుండా కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు.

# అన్నసాగర్‌లో పశువైద్య శిబిరం



పశువుకు చికిత్స నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బంట్వారం(కోట్‌పల్లి), నవంబర్ 9: మండల పరిధిలోని అన్నసాగర్‌లో రాష్ట్ర పశుగణన అభివృద్ధి సంస్థ ధ్వర్యంలో శనివారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు చికిత్స నిర్వహించి పాడి రైతులకు మందులనుఅందజేశారు. 34 గేదెలు, 58 ఆవులకు గర్భకోశ చికిత్సలు, 62 లేగ దూడలకు నట్టల నివారణకు సంబంధించి మందులు అందజేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు అశోక్‌రెడ్డి, వెటర్నరీ అధికారి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పరిగి, నవంబర్ 9: పరిగి పట్టణంలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మార్కెట్‌యార్డు రోడ్డు, హనుమాన్ మందిర్ రోడ్డులో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీ కె.వెంకటనాయుడు తెలిపారు. వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

దౌల్తాబాద్, నవంబర్ 9: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణాధికారిణి లావణ్య సూచించారు. శనివారం ఆమె దౌల్తాబాద్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,320 (ఏ గ్రేడ్), రూ.2,300 (బీ గ్రేడ్) మద్దతు ధర ఇస్తున్నదని తెలిపారు. అలాగే బోనస్ రూపంలో రూ.500 చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాలపై రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఏఈవోలు నిఖిల్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.
NT-339365-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# తప్పుల్లేకుండా వివరాలు నమోదు చేయాలి

- తహసీల్దార్ విజయ్‌కుమార్
- కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



కొడంగల్ : 7వ వార్డు కార్గిల్ కాలనీలోని సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్

కొడంగల్, నవంబర్ 9: సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లు ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు సేకరించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు కార్గిల్ కాలనీలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఇంటి యజమానులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎన్యూమరేటర్ సేకరించిన వివరాలను సరి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో భాగంగా ప్రతి ఇంటినీ సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలతో పాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య తదితర వివరాలు మొత్తం 56 అంశాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**పూర్తి వివరాలు నమోదు చేయాలి**

**పరిగి:** సమగ్ర కుటుంబ సర్వే ఫారంలో పూర్తి వివరాలు నమోదు చేయాలని ఎంపీడీవో ఎంఏ కరీం సూచించారు. మండల పరిధిలోని గడిసింగాపూర్‌లో కొనసాగుతున్న సర్వేను శనివారం ఎంపీడీవో పరిశీలించారు. పట్టణంలోని రెండో వార్డులో నిర్వహిస్తున్న సర్వేను మున్సిపల్ చైర్మన్ అశోక్, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్యతో కలిసి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. ఇంటింటికీ వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, సూపర్‌వైజర్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్యూమరేటర్లు భ్రమరాంబ, విజయ, వెంకట్, నాయకులు వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

**ఎన్యూమరేటర్లకు సర్వే పత్రాల అందజేత**

**మర్పల్లి :** ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లకు ఎంపీడీవో రాజమల్లయ్య సర్వే పత్రాలను అందజేశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామాల్లో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లకు పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణారావు, ఏపీఎం మధుకర్, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

**కోట్‌పల్లిలో 7,500 కుటుంబాల గుర్తింపు**

**బంట్వారం(కోట్‌పల్లి) :** మండల పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతున్నదని కోట్‌పల్లి ఎంపీడీవో డానియల్ తెలిపారు. మొత్తం 18 పంచాయతీల్లో 7500 మంది కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. బంట్వారం మండల పరిధిలో 5700 మంది కుటుంబాలను గుర్తించినట్లు ఎంపీడీవో రాములు తెలిపారు. ఇంటింటికీ వచ్చే ఎన్యూమరేటర్లకు అందరూ సహకరించాలని కోరా రు. ఎన్యూమరేటర్లు కుటుంబ సభ్యులను అడిగి పూర్తి వివరాలు సేకరించాలని సూచిం చారు. సర్వే పత్రంలో తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలన్నారు.

**కులకచర్లలో..**

**కులకచర్ల:** మండల కేంద్రంలో ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను ఎంపీడీవో రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నాటి గురువులతో పూర్వవిద్యార్థులు

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెద్దేముల్, నవంబర్ 9: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి మధుర జ్ఞాపకాలు, చిలిపి చేష్టలు, అప్పటి గురువుల బెత్తం దెబ్బలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయం గా పలకరించుకుని మురిసిపోయారు. నాడు పాఠ్యాంశాలు బోధించిన గురువులను సన్మానించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిషన్ రావు, విశ్రాంత ఉపాధ్యాయులు గాలయ్య, కాశీనాథ్, గురువాచారి, ఆనంద్‌కుమార్, జగదాంబ, ప్రస్తుత ఉపాధ్యాయురాలు సంధ్యా రాణి, పూర్వ విద్యార్థులు, జబర్దస్త్ కమెడియన్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు



జాతర ప్రాంగణాన్ని సందర్శించిన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం

ధారూరు, నవంబర్ 9: ధారూరు మెథడిస్టు జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం సూచించారు. ఈ నెల 12 నుంచి జాతర ప్రారంభం అవుతుండడంతో శనివారం ఆయన జాతర ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, జాతర నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

## సైబర్ నేరగాళ్ల మోసాలతో జాగ్రత్త



దౌల్తాబాద్, నవంబర్ 9: కుటుంబ సర్వే చేస్తున్నామం టూ సైబర్ నేరగాళ్లు మోసాలు చేసే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రవిగౌడ్ శనివారం తెలిపారు. సైబర్ నేరగాళ్లు మొబైల్ ఫోన్లకు పంపించే లింకులపై క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బులు మాయమయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. మరికొందరూ ఓటీపీ చెప్పండని ఫోన్ చేసి అడుగుతున్నారని, ఇలాంటివి నమ్మకండని తెలిపారు.

**PUBLIC NOTICE**

My client Sudha Ravipati, D/o. Mallikarjun Rao Kodali is intending to purchase the open Plot of 400 Sq.yds. Plot No. 157, Survey No. 54P & 55P, RKS Dream City, Ameerpet (GP) & Village, Maheswaram Mandal, RR Dist., North: Plot No. 158, East: 40 Ft. Road, South: 60 Ft. Road, West: Plot No. 156 from Dr. P.Varija Rani, W/o. Mr. G.Vishu Prasad My client paid an advance. If any body have an objection on the sale of the above said property, contact the undersigned with all necessary documents within 7 days from the date of this notice. If no objection is received within the time prescribed, our client will proceed to register the sale deed by paying the sale consideration. Any claims after that will not be considered.

**M.S.RAO,** Advocate
Flat No. 102, Sreyas Apartment,
Sindi Colony, Secunderabad, T.S.,
**Ph: 8331025147, 8008515028.**

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962

# ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

కడ్తాల్, నవంబర్ 9: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని మాజీ ప్రజాప్రతినిధులు అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రతి నెల రెండో శనివారం నిర్వహించే పూజా కార్యక్రమంలో నాయకులు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకొని సన్మార్గంలో నడవాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, ప్రధాన పురోహితుడు వెంకటేశ్వరశర్మ, నాయకులు రాజాగౌడ్, రాములుగుప్తా, వెంకటేశ్, శ్రీనివాస్, కేశవులు, నర్సింహ, కేశవులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కనులపండువగా కల్యాణోత్సవం

కడ్తాల్, నవంబర్ 9: తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్‌లో ఉన్న గోవిందారాజ కొండపై కొలువైన శ్రీదేవీ సమేత గోవిందారాజస్వామి వారి కల్యాణోత్సవం శనివారం అయ్యప్పరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయాన్ని కొబ్బరి, మామిడాకు తోరాణాలు, వివిధ రకాల పూలతో శోభయమానంగా అలంకరించారు. గ్రామానికి చెందిన రేణుకాముకుందరావు దంపతులు, స్వామి వారి కళ్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ, వేదాద్రి లక్ష్మీనరసింహాస్వామి ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి, నాయకులు రవి, నరేందర్‌గౌడ్, శివ, విజయ్‌కుమార్, భాస్కర్‌ఊ, శ్రీను, ప్రభాకర్, గోపాలకృష్ణ, మోహన్‌గుప్తా, ఇస్తారి, భక్తులు పాల్గొన్నారు.

# పేకాటరాయుళ్ల అరెస్టు

పెద్దేముల్, నవంబర్ 9: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న వారిని అరెస్ట్ చేసిన ఘటన శనివారం పెద్దేముల్ పోలీసు స్టేషన్ పరిధిలోని నాగులపల్లి గ్రామ శివారులోని గుట్ట ప్రాంతంలో జరిగింది. ఎస్సై గిరెన్న తెలిపిన వివరాలు.. నాగులపల్లి శివారులోని గుట్ట ప్రాంతంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఏడు గురు పేకాట ఆడుతున్నారు. వారిలో ముగ్గురు నాగులపల్లికి చెందిన బాలప్పగారి వీరారెడ్డి, జక్కల శ్రీనివాస్, మట్ట నర్సింహులు, దాసరి రవి, బోయిని విఠల్, నర్సాపూర్ గ్రామానికి చెందిన మల్లేశం, గోపాల్‌పూర్‌కు చెందిన శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ.8300 స్వాధీనం చేసుకొన్నామని తెలిపారు. ఏడు గురిపై కేసు నమోదు చేశామని తెలిపారు.




